# కైలాసవాసి మా నాయనమ్మ

వడ్లపట్ల దయానందం

నాయనమ్మపై నాకుగల అకుంఠిత భక్తివిశ్వాసాన్నిగాని, ప్రగాఢప్రేమనిగాని ఒక్కసారిగా బయటికి వొలకబోద్దామన్న ఉద్దేశంతో కాదు-నేనిది వ్రాస్తూంట.

తొంభైఐదోపడిలో పడి సావకాశంగా కళ్లు మూసిన నాయనమ్మ చర్యకు హర్షం ప్రకటించడం హర్షించతగింది కాకపోవచ్చు. కాని ఎంత పరిశోధించినా, విచారించటానికి తగిన ఆధారం మాత్రం లభించదన్న మాట. నిర్మొహమాటంగా మాట్లాడదలిస్తే అదే యథార్థం. ఐతేనాకు పెరోక విచారం లేకపోలేదు. అది చివరకు తెలియజేస్తా.

అరవయ్యోపడిలో పడ్డ నాన్న- తల్లి లేని పిల్లవాడైపోయినందుకు-వచ్చిన బంధువులంతా తమ సానుభూతిని నిండుగా వ్యక్తపరచారు. అత్తయ్య మాత్రం ఆ రాత్రికి దుఃఖించిమరు నాడు సినిమాకు వెళ్ళింది. అది వేరే విషయం. దానిలో సబబు కూడా లేక పోలేదు. తల్లి భౌతిక దేహాన్ని తుదిసారిగా దర్శించుకుందామని బస్తీకి ఎలాగూవచ్చిన అత్తయ్య పనిలోపనిగా సినిమా చూడ్డంలో ఆక్షేపణేముంది?

కథానిక

ఆరోజు రాత్రి ఎనిమిదిగంటలకు నాయనమ్మ ప్రాణం పోయినట్లు తాత్కాలిక ప్రకటన జరిగినా మర్నాడుదయం ఎనిమిదిగంటలవరకూ, సదరు ప్రకటనను ధృవపరచుకోడానికి ఎవరికీ ధైర్యం చాలింది కాదు. దానికి కారణం కూడా లేకపోలేదు. అప్పటికి దాదాపు అరపరకసార్లు నాయనమ్మ పోయినట్లేపోయి, తిరిగి కాళ్ళాడించి, పెదవులు మెదిలించి, లేచి కూర్చున్నట్లు నాయనమ్మ గత చరిత్ర స్పష్టపరుస్తోంది. అట్టి పరిస్థితిలో స్వల్ప వ్యవధిలో ఇదమిత్థమని నిర్ధారించటానికి ఎవరికి ధైర్యం చాలుతుంది? అక్కడికీ ఆరాత్రంతా పదిమందీ నిశితంగా నాడి పరీక్షిస్తూనే ఉన్నారు.

క్రిందపెట్టి ప్రమిద వెలిగించిన అనంతరం, నాడి చూచిన గోపాలం బావ "ఇంకా కొద్దిగా ఉన్నట్లే అనుమానం తోస్తోంది"అన్నాడు బాధతో.

పదిమందీ చూచారు—ఔనౌనన్నారు ఏకగ్రీవంగా.

వెలిగించిన ప్రమిద ఆర్పబడ్డది.

మరి కాసేపటికి తిరిగి నాడిచూచి "ఊఁహు.. పోయినట్లే"అనుకున్నారు.

కాని వెంటనే గుండెమీద చేయివేసిచూచి, "అయ్యో ఇంకా వెచ్చగానే ఉందే!" అని నిరుత్సాహపడిపోయారు. ఆ తర్వాత మరి కాసేపటికి, వేళ్ళూ అవీ బిగుసుకుపోతూండడంవల్ల తిరిగి ప్రమిద వెలిగించబోయారు కాని— "అదిగో కను రెప్ప స్పష్టంగా మెదిలింది" అన్న మాణిక్యం వాక్యానికి, తిరిగి నిరుత్సాహాన్నే ఫీలయ్యారు.

ఎలాగయితేనేం, ఉదయం ఎనిమిది గంటలకి అందరిమీదా కరుణించిన నాయనమ్మ నికరమైన నిర్ధారణకు తావిచ్చింది.

"ధన్యురాలు ముక్తిని పొందింది. అంతకాలం మనం బ్రతకపోతామా? ఏమిటో, పూర్వకాలపు అపూర్వ మనిషి కాబట్టి కాని..." అన్న మాటలు అందరి నోటివెంటా భేదించకుండా వెలువడ్డాయి.

రావలసినవారంతా వచ్చారు. చేయవలసిన సరంజామా అంతా పూర్తిచేశారు. మామయ్య మాత్రం ఏమిటో చిర్రుబుర్రు లాడుతూనే ఉన్నాడు.

అరడజను సంతానంతో మనవళ్ళనెత్తిన మా మావగారు-ముప్పయ్యేళ్ళనాడు ఆయనకి చదివించిన కట్నం ఇప్పటికీ ఇవ్వలేదన్న ఆయన ఆక్షేపణను ఫలానా ఆవిడిదగ్గర, నాయనమ్మ కొద్ది మాసాలక్రితం ఖండించిందట. "హాత్తేరి, అంతపెద్దది కూడా నా కట్నవిషయంలో అలా అబద్ధమాడుతుందా?"అన్నది ఆయన బాధ పాపం!

అందరికంటే మా మరదలు మరీ కంటతడి పెట్టింది. నాయనమ్మ బ్రతికుండగా, మరదల్ని ఎప్పుడూ అంటూండేది—

"తల్లివిగదే, మా బంగారు తల్లివి! నా అప్ప పేరేగా నీకు పెట్టుకుంది"అని-అనంతమైన వాత్సల్యాన్ని మా మరదలిమీద నిండుగా వొలకబోసేది. అంతటి వాత్సల్యంతో చూచుకున్న అమమ్మ ఇక లేకుండాపోయిందే అన్న దిగులుచేతే కాబోలు ఆవిడ అంతగా కన్నీరు కార్చింది.

అహఁ. అసలానాటి మరదలి కన్నీటికి నికర కారణం-ఆ సాయంత్రానికికాని లోపాయికారీగా తెలియలేదు.

తను నాగదిలో ఉండగా-ఆ విషయం పట్టించుకోక-ఆ గదిలో తిరిగానట. తనకి తెగ సిగ్గేసిందట. ఆ విషయం నే గుర్తించలేదట. మీదుమిక్కిలి "నువ్వు నా గదినుంచి బయటికి వెళ్ళిపో"మ్మన్నట్లుగానే ప్రవర్తించానట. అందుకు దుఃఖంవచ్చి మరో గదిలోకి వెళ్ళి సావకాశంగా కన్నీరు కార్చిందట. నాకేం తెలుసు? ముందు అమ్మమ్మ కోసమే ఏడ్చిందనుకున్నాను, ఆ తర్వాతకాని తెలియలేదు నా మూలాన ఏడ్చిందని.

ఏమిటో వెధవ బెట్టుసరి కాకపోతే "ఏం బావా, ఇవ్వాళ్టికి నీగది మాకిచ్చేయ్" అని డైరెక్టుగా అడిగితే నే కాదంటానా? అసలు మా మరదలిదంతా బెట్టుసరి వ్యవహారం. తనా గదిలో ఉండ నిశ్చయించిందనిన్నీ నేనా గదిలోకి వెళ్ళగూడదనిన్నీ తన భావంగా నేను గ్రహించలేదని ఊరికే నాపై ఆగ్రహించి కన్నీరు కారిస్తే ఎవడేం చేస్తాడు? అయినా ఎందుకొచ్చింది లెండి వెధవ గొడవ! అసలావిడకి ముక్కునే ఉంటుంది కోపం.

నాన్నా మావయ్యల ముఖాలు ఎప్పుడూ ఎడాపెడా నేనయ్యే. మళ్ళీ ఇద్దరూ ముఖాముఖీ మాట్లాడుకునేటప్పుడు మాత్రం మందస్మిత వదనారవిందులయ్యే ఉంటారు. అందుకే నాకు చాలసార్లు వాళ్ళ ప్రవర్తనచూస్తే పుట్టెడాశ్చర్యం కలుగుతూంటుంది. అలా ఇద్దరూ నవ్వుతూనే మాట్లాడుకుంటారు. ఆ మరుక్షణంలోనే ఆ పెడకెళ్ళి "చూశారా మా బావదంతా మోసం! పెళ్ళినాడు చదివించినకట్నంఇవ్వనేలేదు" అంటాడుమావయ్య.

"చూచారా మా బావమఱిదిదంతా బూటకం. ఏ రూపేణా ఐతేనేం, రెట్టింపు ముట్టజెప్పాను. ఇంకా లేదనేగోల! ఏమైనా అర్థం ఉందా?" అంటూ సూటిప్రశ్న వేస్తాడు నాన్న.

అన్నింటికంటే ఆశ్చర్యం రామ...రామ-మన వల్లెత్తిన ఇద్దరిమధ్య ముప్పైఫ సంవత్సరాలక్రితం పెళ్ళినాటి కట్నం పేచి కీచులాట ఇప్పుడేమిటంటే? ఎవరైనా వింటే నవ్వరూ? పోనీ నాబోటి గాణ్ణి ఏమైనా అందామంటే బొత్తిగా అనుభవం లేని కుర్రకారునయ్యే! (వాళ్ళదృష్టిలో) వాళ్ళు వయసుమీరిన అనుభవజ్ఞులయ్యే! అట్టి పరిస్థితిలో ఏమైనా అనడానికి, నేనెలా సాహసించేది?

రావలసిన వారంతా వచ్చారు. కానివ్వవలసిన సరంజామా అంతా కానిచ్చారు. స్నానం పూర్తి చేయించారు. నాయనమ్మ భౌతిక దేహాన్ని రథంపై పరుండబెట్టారు. అత్తయ్య బిగ్గరగా ఏడ్వబోయింది. నాన్న కంటతడి పెట్టబోయాడు. ఏడ్వబోయిన త్తయ్యను, కన్నీరు కార్చబోయిన నాన్నని చూచి అందరూ వారించారు. పండు పరుగన్నారు. రాలిపోవడం సుఖం అన్నారు. ఏడిస్తే మోక్షం కలగదన్నారు. ఆ కన్నీళ్ళే ఆవిడి మోక్షమార్గానికి, అమాంతం అడ్డు నిలుస్తవన్నారు. ఊరుకోమన్నారు ఉరడించారు.

ఎనభై ఏళ్ళ అచ్చమ్మామ్మ అంటే నాయనమ్మ ఆడుబిడ్డ నన్ను చాటుకు పిలిచి అంది:

"బాబూ నువ్వుకూడా వెంట వెడతావుగదూ. చూచావూ అసలు చనిపోయిన మూడు రోజుల వరకూ ప్రాణం తలలో ఏదో ఒక వెంట్రుకను పట్టి ఉంటుందట. ఒక్కోసారి ఆ యమధర్మరాజు మరి కాసిని నూకలు వళ్లోపోసి తిరిగి పొమ్మనటం కూడాకద్దు. అంతెందుకు మన గురవయ్య నెరుగుదువుగా? ఆ గురవయ్య. తోడల్లుడి బావమరది భార్య అమ్మమ్మ ఇలానే బ్రతికిచెప్పిందిగా నూకలు పోసి తిరిగి పొమ్మన్నాడని."

"పావుసేరా అర్థసేరా మామ్మా" అన్నాను యథాలాపంగా.

"అదేవిట్రా నాయనా అలా అంటావ్! నీకు తెలియదు బాబూ. ఒక్కోసారి ఆ యమభటులు కూడా పొరపాటు పడుతూంటారు. మా చలమయ్య బాబాయ్ తల్లిసంగతేమయింది? ఇలానే పొరపాటు జరిగిందిగా! ఆ మర్నాడు తిరిగి బ్రతగ్గానే ప్రక్కింటిలో మరో ప్రాణం ఘాం అంది. ఆ మట్నాఁడ చెప్పింది ఆ యమధర్మరాజు ఆ భటులమీద ఎగిరిపడి తిట్టాడట." అచ్చమ్మామ్మ

చెప్పుకు పోతోంది. ఎప్పటికి దానికి ఫుల్‌స్టాపు ఉంటుందో ఊహించటం కష్టం. మధ్యలోనే అందుకుని అన్నాను. "ఇంతకీ నువ్వనేదేమిటి మామ్మా!" అని.

"అహా మరేం లేదు మూడు సార్లు ఖచ్చితంగా దింపించు. ముసలి కట్టేకదా అని నిర్లక్ష్యం చేస్తారేమో. ఒకవేళ ప్రాణం మళ్ళీ చేరుకుంటే అటువంటి సమయాల్లోనే చేరుకునేది. పాపం ఒదిన ఎప్పుడూ అంటూండేది తను నూటొక్కసంవత్సరం బ్రతుకుతానని" అచ్చమ్మామ్మ కళ్ళల్లో నీరు నింపుకుని మాటాగిపోయింది.

పాపం అచ్చమ్మామ్మ వొదిన్ని ఎలాగైనా బ్రతికించుకోవాలన్న గట్టి పట్టుదలతో ఆఖరువరకూ శుశ్రూష చేస్తూనే ఉంది.

పోయేముందు - బాధతో మూలుగుతుంటే విసనకర్రతో విసురుతూ సలహాసైతం ఇచ్చింది. "బాధపడకు వదినా నారాయణా-నారాయణా-అనుకో మోక్షం" అని. కాని నాయనమ్మ ఎంత పూర్వకాలపు పాతభావాలు కలదైనా, ఈ విషయంలో మట్టుకు ఫక్తు అధునాతన పంథానే అవలంబించేది.

"ఏమిటో వదినా, కళ్ళుమూస్తే అంతా చీకటే.' దేవుడూగీముడూ, ఊహూ నాకేం నమ్మకంలేదు." అనేది నాయనమ్మ చప్పిదవడ లాడిస్తూ. అందుకే నాయనమ్మ చనిపోయేముందువరకు, ఐహిక విషయాల మీదే ఎక్కువ ఆసక్తిచూపేది. ఆముష్మిక చింతన నసలే తలపెట్టేది కాదు.

మంచంమీద పడుకునే అమ్మ నెపుడూ కేక లేస్తూ ఉండేది.

"ఏఁవే బుల్లమ్మా, పనిమనిషి గదులూడ్చేటప్పుడు దగ్గరుండమని నీ కెన్నిసార్లు చెప్పాను? అదసలే దొంగది. కారం చింతపండూ మూటగట్టుకు ఎత్తుకుపోతుంది. ఏమిటో చెవిటే నువ్వు వినిపించుకోవ్" అని మందలిస్తూండేది.

"అబ్బబ్బ ఎప్పుడూ మీకు ఆ గొడవే. కృష్ణా రామా అనుకోరాదూ" అని అమ్మ ఎప్పుడైనా విసుక్కుంటే-"ఒరే బాబూ ఇట్రారా" అంటూ నన్ను పిలిచి మంచంమీద కూర్చోబెట్టుకుని ఆయాసపడుతూ చెప్పేది.

"నీదేరా నాయనా నాకు బెంగ. నీకూ ఆ మూడు ముళ్ళూ పడితే, సంతోషంగా కన్ను మూసే దాన్ని. మీ నాన్నా మావయ్యల తీరుచూస్తే ఆ వదా నున్నదయ్యె. ఏమిటో, అతుకుతుందో-అతకదో" అని దవడలాడిపిస్తూ కన్నీరు కార్చేది.

"ఊహూ,నువ్విచారించకు నాన్నమ్మా. చివరికి అదే అతుకుతుందిలెద్దూ" అనేవాడిని కాసేపు విసనకర్రతో విసురుతూ. తిరిగి అనేది: "ఒరేవ్ నాయనా, దానికి మా అప్పపేరేగా పెట్టుకుంది. ఎలా చూచుకుంటావో ఏమో, అది కాస్త కోపిష్టిరా బాబూ. నువ్వే సర్దుకుపోతూ సంసారం చెయ్యాలి. ఇప్పటిలా దూబరాగా ఉండబోకు, అది మహా పొదుపరిలే. నీ ఆటలదే కట్టించేస్తుంది" అనేది చూడ ముచ్చటైన చిరునవ్వుతో.

నాయనమ్మముందు సిగ్గు నటించి "ఊ-పో, నాయనమ్మా" అని, తిరిగి "అలానేలే నాయనమ్మా, నాకుమాత్రం తెలీదూ-ఏదీ ఒక పావలా ఉంటే ఇలా ఇవ్వు అలా బయటికెళ్ళి రావాలి" అనేవాడిని.

"ఊ అదేరా నీదగ్గరుంది! ఊరికే ఖర్చుచేసి పారేస్తావ్" అంటూ గుర్రుగా చూచి, తలగడ క్రింద సంచిలోని పావలా తీసి తడిమిచూచి, "ఇది అర్థరూపాయేమో చూడు" అని చేతికిచ్చేది.

ఆఖరు దశలోనే నాయనమ్మ పొదుపుకు మరీ అంతులేకుండా పోయింది. పెరట్లో పూచికపుల్ల కన్పిస్తే, తెచ్చి చీపురున గుచ్చుతూండేది.

తన తాలూకు దాదాపు లక్షరూపాయ లాస్థిని నాన్న నిశ్శేషంగా ఖర్చుపెట్టినా, కిమ్మనక మిన్నకుండిన నాయనమ్మ, ఆఖరులో అంత పొదుపరిగా ఉంటూ, నన్నుసైతం పొదుపుగా ఉండమని వేధించటంలో అర్థం లేకపోలేదు.

"నారాయణ-నారాయణ" అంటూ నలుగురు పట్టారు. నాయనమ్మ భౌతిం దేహం అంతిమ యాత్రకు కదలిపోయింది.

చితిపై లేచిన మంటలమధ్య భౌతిక రూపం రూపుమాసిపోతూంటే నాకు తెలియకుండానే నా కళ్ళనుండి నీళ్ళు రాలాయి. ఏదేమైనా, యిరవై సుదీర్ఘమైన సంవత్సరాలు మంచాన పడివున్న పతికి ఏ ఒక్కక్షణమూ విసుక్కోకుండా సేవచేసిన మహా సాధ్వి నాయనమ్మ...పోయింది. ★